లేబర్ రూమ్.

'లేబర్' అంటే కాయకష్టం అని అర్థం.

ఎంతటి ఏడు మల్లెల ఎత్తున్న రాకుమారికైనా తప్పని కష్టం 'కాన్పు'

అందుకే కామోసు కాన్పుల గది కా పేరు! ! !

మన్నితత్వానికీ, సౌకుమార్యానికీ, స్నిగ్ధత్వానికీ, ప్రతీకలయిన స్త్రీ జనావళి పురిటినొప్పులు భరించ లేక, భయంకరంగా కేకలు వేస్తున్నారు. ఈ కేకల మధ్య, అరుపుల మధ్య 'హౌస్‌మెన్లు'గా తిరిగేస్తున్నారు



డా॥ కె వి ఎల్. వరసింహారావు

హౌస్ సర్జన్లు, పోస్టు-గ్రాడ్యుయేట్లు, ఆయాలు, నర్సులు వగైరాలు. కానీ, కొత్తగా డ్యూటీ పడిన ఫైనల్ ఇయర్ స్టూడెంటు ప్రభాకరానికి మాత్రం ఈ వాతావరణంలో పిచ్చెత్తినట్టుగా ఉంది.

ఇంతలో ఒక స్ట్రెచర్ మీద తీసుకు రాబడింది అప్పలమ్మ. పేషెంటును చూడగానే "పి. వి." పరీక్ష చేయడానికి గ్లోవ్స్ తొడుక్కుని తయారయ్యాడో స్టూడెంటు. అతణ్ణి చూడగానే ఆమె—"నాకు మగ డాక్టరొద్దు, బాబూ" అని అరవటం మొదలు పెట్టింది. అతని చేత పరీక్ష చేయించుకోవడానికి మొరాయించింది. ఇంతలో స్టాఫ్ నర్సు వచ్చి, "ఏయ్! ఏంటా అరుపులు? అరవకు. ఒక చిన్న ఆపరేషను చెయ్యాలి" అని గద్దించింది.

"ఆపరేషనేదో ఆడామె చేతే చేయించు, తల్లీ" అం దా అప్పలమ్మ.

"ఓహో! భలే ఉందే! ఆపరేషన్లు మగాళ్ళే చేస్తారు. ఆడాళ్ళు చెయ్యరు. అది తెలియకుండానే ఇక్కడికి వచ్చావా?" అంటూ ఎద్దేవా చేసింది.

చుట్టూ ఉన్న జనాలంతా ఫెుల్లుమన్నారు.

"మోడెస్టీ కోసం ప్రాకులాడుతున్న ఆమె మీద ఈ ఆడవాళ్ళే ఎలా జోక్ చేయగలుగుతున్నారు?" ఆశ్చర్యపోయాడు ప్రభాకరం. లేబర్ రూమ్‌ను, అక్కడి వాతావరణాన్ని చూస్తున్న అతనికి చటుక్కున చిన్నప్పుడు ఎప్పుడో చదువుకున్న రామాయణం గుర్తు కొచ్చింది. అశోకవనంలో సీతమ్మవారు గోడు గోడున ఏడుస్తుంటే, ప్రక్కనే కూర్చుని పేలు కుక్కుకుంటూ, ప్రేలాపనలు పేలుతూ, పరాచికాలు ఆడుతూ పహరా కాచిన రాక్షస స్త్రీలు గుర్తు కొచ్చారు.

"ప్రభాకర్! ఎ కేస్ కేమ్ ఇన్ రిసెప్షన్. యూ ఎగ్జామిన్ హర్ అండ్ రైట్ డౌన్ కేస్‌షీట్." అసిస్టెంట్ ప్రొఫెసర్ గారి ఆర్డరు ప్రభాకరాన్ని ఆలోచనలలోంచి ఇవతలికిలాగింది. ప్రభాకరం ఆమెను పరీక్ష చేయడానికి రిసెప్షన్ రూమ్‌లోకి నడిచాడు. ఆమెను చూడగానే ఏదో ప్రత్యేకత, ముఖంలో చక్కని కళ కొట్టవచ్చినట్లు కనబడుతూంది. గుడ్డలూ, కట్టూ బొట్టూ అంతా మధ్య తరగతికి చెందిన స్త్రీ లాగా ఉంది. 'నెలలు నిండిన అతివలో నిండైన అందం నిండి ఉంటుంది' అన్న మాటకు నిదర్శనంగా ఉం దామె. రొటీన్‌గా పరీక్ష చేయడం మొదలు పెట్టాడు.

"ఏమమ్మా! మీ పేరు ఏమిటండీ?"

"శారద."

"వయసు?"

"ఇరవై మూడు."

"పెళ్ళయి ఎన్నాళ్ళయింది?"

"రెండు సంవత్సరాలండి."

"ఎన్నో కాన్పు?"

"మొదటిదేనండి."

"ఇంతకు ముందు నెలతప్పటం ఏమన్నా ఉందా?"

". . ." అర్థం అయినట్టు లేదు.

"అంటే, ఈ కాన్పే మొదటిదా? ఇంతకు ముందు గర్భం వచ్చి, స్రావం అవడం గట్రా ఏమన్నా ఉందా?"

"అబ్బే! లేదండి. ఇదే మొదటిది. ఇదికూడా డి అండ్ సి చేశాకేను."

"నాలుక చూపించండి."

రొటీన్‌గా పరీక్ష చేస్తున్న ప్రభాకరాన్ని ఆకర్షించిందో 'స్కార్'. పొట్ట మీద, బొడ్డు కిందుగా కుడి వైపున మూడు అంగుళాల పొడవు ఉన్న ఆ మచ్చను చూశాడు.

"ఏమమ్మా? ఈ కోత ఏమిటి? ఏమన్నా ఆపరేషన్ చేశారా?"

"అవునండీ."

"ఏం ఆపరేషనో తెలుసా, అమ్మా?"

"తెలీదండి."

"పోనీ, ఎందుకు చేశారో తెలుసా?"

"ఏదో కడుపులో నొప్పి వస్తుండేదండీ. అప్పుడు చేశారు." తల్లి కాబోలు చెప్పింది.

"ఈ ఆపరేషను అయ్యాక నొప్పి తగ్గిపోయిందా?"

"ఆఁ!" అంటూ తలూపిం దామె.

ఈ ఆపరేషను ఎందుకోసం చేయబడిందో అర్థం కాలేదు ప్రభాకరానికి. కానీ, రొటీన్‌గా మిగిలిన పరీక్షలు ముగించాడు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గారికి కేసును 'ఇంట్రొడ్యూస్' చేస్తూ, ఈ 'స్కార్' గురించి తెలిపాడు. కారణం గురించి అడిగాడు.

"బహుశా అపెండిసైటిస్‌కోసం చేసి ఉండవచ్చు. ఇండియాలో చీరలు కడతారు కదా. మచ్చ పైకి కనిపించకుండా ఉండటానికి, అదీ కాకపోతే, ఒక్కొక్కప్పుడు అపెండిక్స్ పొజిషన్ అర్థం కాకపోతేనో అలా బొడ్డు క్రింద రైట్ పారామీడియన్‌గా 'ఇన్‌సిషన్' ఇస్తుంటారు" అని చెప్పా రామె.

